విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 01 ఆగస్టు 2025 8 పేజీలు

జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

లేఅవుట్‌లలో సౌకర్యాలకు నిధులు మంజూరు చేయడం జరుగుతుంది

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - చిత్తూరు: వారాంతపు లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరగాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశిం చారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో పూతలపట్టు, జీడి నెల్లూరు, నియోజకవర్గాలకు సంబం ధించిన ఎన్టీఆర్ హౌసింగ్ గృహ నిర్మా ణాల పురోగతిపై హౌసింగ్ అధికారులు, డిఈలు, ఏఈలు, పిఆర్ ఏఈ లతో ఇంజ నీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశలలో ఉన్న గృహాలను, లేఅవుట్లను ప్రతిరోజు ఇంజనీరింగ్అసిస్టెంట్లు క్షేత్రస్థా యిలో పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించాలని ఆదేశిం చారు. రోజువారీ లక్ష్యాలు పెట్టుకొని పని చేయాలని, పురోగతి సాధించాలని సూచించారు. లబ్దిదారు లను ప్రోత్సహించి నిర్మాణాల్లో ఆశాజ నక ఫలితాలు సాధించాలని చెప్పారు. విద్యుత్, తాగునీరు, డ్రెయిన్లు, అప్రోచ్ రోడ్లు వంటి సాము దాయక మౌలిక వసతుల కల్పనకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. గుత్తేదార్లతో మాట్లాడి పనుల్లో జోరు పెంచాలని చెప్పారు. పేస్ అథెంటికేషన్, స్టేజ్ అప్డేషన్ ప్రక్రియలను క్రమం తప్ప కుండా నిర్వహించాలన్నారు. నిర్మా ణాలు పూర్తయిన ఇళ్ల వివరాలను సంబంధిత లబ్దిదారులు తెలియజే యాలని చెప్పారు. ప్రతి ఒక ఇంజనీ రింగ్ అసిస్టెంట్ నెలకు రెండు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు. అదే విధంగా నెలకు నాలుగు ఇళ్ల వివిధ దశలలో ఉన్న ఇళ్ల నిర్మా ణం పనులు పురోగతి సాధించాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వివరాలను సంబంధిత

2లో

అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభానికి

ఏర్పాట్లు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సూచించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 2వ తేదీన ప్రకాశం జిల్లా దర్శిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పథకం ప్రారంభించ నున్నారు. జిల్లాలో ఈ పథకానికి అర్హులైన 154807 మంది రైతుల్లో ఇప్పటికే 150161 మంది ఈకేవైసి ప్రక్రియ పూర్తి చేసుకు న్నారని, ఇంకా 3114 మంది రిజెక్ట్, 1532 మంది పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్ ఈకేవైసీని తక్షణమే పూర్తిచేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ పథకం ద్వారా రైతు కుటుంబానికి సంవత్స రానికి

2లో

తిరుమలలో సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరణపై..

టీటీడీ కఠిన చర్యలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయం ముందు , మాడ వీధుల్లో ఇటీవల కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు (రీల్స్) చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. తిరుమల లాంటి పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర ,అసభ్యకర చర్యలు అనుచితం.భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తు న్నాయి. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు

2లో

టీటీడీ కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి) నిలయమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. తిరుమలలో కేవలం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకే పరిమితం కావాలి. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత. టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించడమైనది. తిరుమల పవిత్రతను భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది. తిరుమలలో అసభ్యకర వీడి యోలు, వెకిలి చేష్టలతో రీల్స్ చేయకుండా తిరుమలలో ఆధ్యాత్మిక వాతావ ్ణం, పవిత్రతను కాపాడడంలో సహకరించాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

జిల్లాలో గృహ నిర్మాణాల వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి) లబ్ధిదారులు తెలియజేయాలని చెప్పారు. వివిధ లేఅవుట్ లలో పలు సమస్యలపై ఆరా తీశారు, అప్రోచ్ రోడ్డు కొరకు, విద్యుత్ సౌకర్యం కొరకు, త్రాగు నీటి కొరకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నాకు నివేదికలు అందజేసిన నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు, హౌసింగ్ నిర్మాణాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను ఆదేశించారు. హౌసింగ్ అక్కర్లేని లబ్ధిదారుల జాబితాను హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం అందిస్తున్న అదనపు సాయంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. పూతలపట్టు నియోజకవర్గం సంబంధించి 10,348 ఇళ్ళు మంజూరు కాగా ఇందులో రూ. 14.20 కోట్ల ఖర్చుతో 7,896 ఇళ్ల పూర్తయినవని, 2217 గృహాలువివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. జూలై నెలకు సంబంధించి 35 గృహాలు స్టేజ్ కన్వర్షన్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం కింద 863 మందికి 2.19 కోట్ల ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని తెలిపారు జీడి నెల్లూరు నియోజకవర్గానికి సంబంధించి 10,740 2 మంజూరు కాగా ఇందులో రూ.14.54 కోట్లతో 8,057 ఇళ్లు నిర్మాణాలు పూర్తికాబడినయని 2,454 ఇల్లు వివిధ దశలో నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. జూలై నెలకు సంబంధించి 76 గృహాలు స్టేజ్ కన్వెన్షన్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం కింద 1,191 మంది లబ్ధిదారులకు రూ.3.0 కోట్లు ఆర్థిక సహాయం లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఈ లు, రాఘవయ్య, యోగమత్యనాయుడు, హౌసింగ్ ఏఈ లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తిచేయాలి

(మొదటి పేజీ తరువాయి) రూ.20,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో కేంద్రం రూ.6,000 అందిస్తే, రాష్ట్రం రూ.14,000 జతచేస్తుంది. మొదటి విడతగా ఆగస్టు 2న కేంద్రం వాటా రూ.2,000, రాష్ట్రం వాటా రూ.5,000 చొప్పున విడుదల చేయనున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రారం భోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యాన్ని కల్పించాలన్నారు. అలాగే, రైతు సేవా కేంద్రాల్లో అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించాలనీ, లింకులు ప్రతి రైతుకు షేర్ చేయాలని సూచించారు. రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్ లేదా "మన మిత్ర" వాట్సాప్ గవర్నెన్స్‌లోని "మీ స్థితిని తెలుసుకోండి" ఎంపిక ద్వారా తమ అర్హతను తెలుసుకోగలరని చెప్పారు. ఎన్పిసిఐ లింక్ ఇనాక్టివ్ ఉన్నవారు వెంటనే యాక్టివ్ చేసుకోవాలని, ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు జత చేయాలని సూచించారు. అంతేగాక, అన్ని వర్గాల కౌలు రైతులకు రూ.10,000 చొప్పున అక్టోబర్, జనవరి నెలల్లో రెండు విడతలుగా మొత్తం రూ.20,000 అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నేటి నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: జిల్లాలో ఆగస్టు 1 నుండి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వసంత బాయి తెలిపారు. ఈ వారోత్సవాలు జిల్లా స్థాయిలో ప్రాజెక్ట్లు, అంగన్వాడి కేంద్రాల్లో విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తల్లి పాలు శిశువుల ఆరోగ్యం, అభివృద్ధికి కీలకమని, పుట్టిన వెంటనే పాలు ఇవ్వడం వల్ల శిశువులకు మాత్రమే కాకుండా తల్లులకు కూడా అనేక రకాల ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. తల్లి పాలలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వులు వంటి అవసరమైన పోషకాలు సమపాళ్లలో ఉండటం వల్ల శిశువుల పెరుగుదల సజావుగా సాగుతుందన్నారు. అలాగే, తల్లి పాలలోని యాంటీబాడీలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచి, శ్వాసకోశ, జీర్ణశయాంతర రుగ్మతలు, ఆకస్మిక శిశుమరణ సిండ్రోమ్ వంటి ప్రమాదాల నుంచి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ఈ వారోత్సవాలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తుండగా, జిల్లా స్థాయిలో కూడా సమగ్ర కార్యక్రమాలు చేపట్టాలని ఆమె తెలిపారు.

క్రీడలతో శారీరక మానసిక దృఢత్వం: తుడా చైర్మన్

విశాలాంధ్ర- తిరుపతి : మానసిక, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా గత మూడు రోజుల నుంచి రాష్ట్రస్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం బహుమతి ప్రధానోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి,దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తద్వారా వారికి ఉన్నత స్థాయి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు క్రీడాభివృద్ధికి కావలసిన నిధులను మంజూరు చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. అందులో భాగంగా తుడా నిధులతో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను అభివృద్ధి చేస్తున్నామని తుడా చైర్మెన్ వెల్లడించారు. అనంతరం బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్,మిక్స్ విన్నర్స్ రన్నర్స్ కి బహుమతి ప్రధానం చేసి వారిని అభినందించారు. చివరగా ముఖ్య అతిథులను చిత్తూరు జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ ప్లేయర్ కిడంబి నందగోపాల్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, దంపురి భాస్కర్ యాదవ్ క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా రాయలవారి రాయల్ మార్చ్

విశాలాంధ్ర - చంద్రగిరి: రాయలవారి జయంతిని ప్రభుత్వం మరియు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్ పి ఎఫ్) నిర్వహించిన పాదయాత్రకు విశేష స్పందన లభించి దిగ్విజయంగా సాగింది. ఈ సందర్భంగా రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ ఇది ప్రారంభం మాత్రమేనని శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించని పక్షంలో భారీ ఎత్తున ఉద్యమి స్తామని హెచ్చరించారు. రాయలసీమ నుంచే కాక విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి కూడా పెద్దమొత్తం లో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్ పి ఎఫ్) సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, బలిజ కుల సంఘాల ప్రతినిధులు, కుల పెద్దలు హాజరై విజయవంతం చేశారు. చంద్రగిరి రాయలకోట నుండి పాదయాత్రగా వెళ్లి అలిపిరి చేరుకొని అలిపిరి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి తదుపరి టిటిడి అడ్మినిస్ట్రేషన్ భవనం ఇఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డి శేఖర్ రాయల్, చంద్రగిరి మునిరత్నం రాయల్, విజయవాడ పోరుమామిళ్ల ఈశ్వర్, గుంటూరు అమ్మ శ్రీనివాస్ నాయుడు, పుత్తూరు గోపి రాయల్, నగిరి బాబు, పిచ్చాటూరు త్యాగరాజు, పులివెందల అల్లం రంగనాయకులు, కడప శ్రీపతి, చక్రవర్తి, చిత్తూరు కోటేశ్వరరావు, పూతలపట్టు హేమాద్రి, పుంగనూరు రాఘవ, ఎర్రవారిపాళెం రఘు, రెడ్డప్ప, బాల పాల్గొన్నారు.

పుత్తూరు డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర - పుత్తూరు : 2025- 26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరబోయే విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బి ఏ ఎకనామిక్స్, బిఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బి ఎస్ స్సి మ్యాథమెటిక్స్, బీఎస్సీ బాటని, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బిఎస్సి ఫిజిక్స్, బిఎస్సి కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కళాశాలలో ఆధునిక ల్యాబ్ సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్ లు, వర్చువల్ తరగతి గదులు ఉండటం వల్ల ప్రాక్టికల్ జ్ఞానాన్ని విద్యార్థులు పొందవచ్చు. డాక్టరేట్ విద్యార్హతలు గల అధ్యాపకుల సేవలను విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని,డిగ్రీలో చేరదల్చిన విద్యార్థిని విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలు తీసుకొని కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలియజేస్తున్నారు. ఇతర వివరాలకు పనివేళల్లో ఆఫీసులో సంప్రదించవచ్చు.లేక 9441775347, 8374556441 నంబర్లలో గాని సంప్రదించవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి తెలియజేస్తున్నారు.

ముక్కంటి సేవలో చంద్రగిరి ఎమ్మెల్యే

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వ రస్వామిని గురువారం చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని దర్శించు కున్నారు. ఆలయ అధికా రులు, టీడీపీ నేతలు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రంగినేని చెంచయ్యానాయుడు, హరి, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో కల్లూరు నరసింహులు సేవలు అమూల్యమైనవి

ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. శ్యాంబాబు.

విశాలాంధ్ర- తిరుపతి : స్థానిక ఆర్. సి. రోడ్ లోని కార్మిక రాజ్య బీమా (ఈ. ఎస్. ఐ)ఆసుపత్రి లో 34 సంవత్సరాల పాటు రోగులకు సేవలు అందించిన కల్లూరు. నరసింహులు సేవలు అమూల్యమైనవని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు.ఈ. ఎస్. ఐ. ఆసుపత్రి లో డ్రెస్సర్, నర్సింగ్ ఆర్డర్లీ గా వుంటూ, ఆర్థో, ఎమర్జెన్సీ విభాగంలో వేలాది మందికి సేవలు అందించిన కె. శ్రీనివాసులు గురువారం పదవీ విరమణ చేయగా, ఆయన్ను ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, బంధువులు పెద్ద ఎత్తున సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి ఆర్. ఎం. ఓ. డాక్టర్. వి. వి. ఎస్. ప్రసాద్, స్పెషల్ గ్రేడ్ స్పెషలిస్ట్ డాక్టర్ యు. వెంకయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సి. అమ్ములు, లే సెక్రటరీ అధికారి రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఓ అరుదైన అనుభూతి

విశాలాంధ్ర -తిరుపతి : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో ఈ రోజు సాయంత్రం విశ్వవిద్యాలయంలో పనిచేసి పదవీ విరమణ చేసిన 67 మంది బోధనేతర ఉద్యోగులకు సన్మానం జరిగింది. యస్వీయూ ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు సంయుక్తంగా ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాల యంలో అభివృద్ధి బోధనేతర సిబ్బంది నిరంతర కృషిపై ఆధారపడి వుంటుందని, యస్వీ యూనివర్సిటీలో బోధనేతర సిబ్బంది ఎంతో నైపుణ్యం కలిగిన వున్నారని, విశ్వవిద్యాలయంలో ప్రతి సెక్షన్లో మార్గదర్శకాలు బోధనేతర సిబ్బంది చొరవతో సిద్ధమవుతాయని అన్నారు. విశ్వవిద్యాలయానికి బోధన , బోధనేతర సిబ్బంది రెండు కళ్ళు వంటివారని అన్నారు. అనేక రకాల కారణాలతో 2022 నుండి పదవీవిరమణ పొందిన వారికి సన్మానం జరగలేదని ఈ రోజు గతంలో, నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు గౌరవంగా సత్కరించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది అధ్యక్ష , కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం, డిప్యూటీ రిజిస్ట్రార్ చంద్రయ్య, సునీత విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సుపరిపాలనఅందించడమే సీఎం ధ్యేయం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణంలోని నాలుగు మాడవీదుల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ కరపత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ధ్వంసమైన వ్యవస్థలను సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో గాడిలోపెడుతునానరన్నారు. అదే విధంగా సంక్షేమం, అభివృద్ధి వైపు దృష్టి సారించారన్నారు. ఇప్పటి వరకు అమలు చేసిన మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం గురించి వివరించారు. ఇక శనివారం నుంచి అన్నదాత సుఖీభవ పథకం అమలు అవుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తారన్నారు. రానున్న రోజుల్లో సూపర్‌సిక్స్ పథకాలే కాకుండా మరన్ని సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అందించేది సుపరిపాలన

భూమనకు సుబ్బయ్య కౌంటర్

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: హిట్లర్ పరిపాలన తెచ్చింది జగనే అని.. చంద్రబాబునాయుడు ప్రజలకు సుపరిపాలన అందిస్తు న్నారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గిరిజన సలహా మండల సభ్యులు. ఏం. సుబ్బయ్య అన్నారు. టీటీడీ పాలకమండలి మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలకు కౌంటర్‌గా గురువారం ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 దాకా ఈ రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చింది వైసిపి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. అందులో భాగంగా తిరుపతిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను నాయకులను నాడు ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి గారు చిత్రహింసల గురిచేసి బైండోవర్ కేసులు పెట్టి. మర్డర్ల కేసులు పెట్టి అత్యా నేరాల కింద అరెస్టు చేసి ఎంతోమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాయకులను జైల్లో పెట్టించి చారన్నారు. ఈరోజు ఆయన దయ్యాలు వేదాలు వల్లించినట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. మరోసారి చంద్రబాబునాయుడు గురించి గానీ కూటమీ ప్రభుత్వంపై తప్పుగా మాట్లాడితే మేము కూడా ఊరుకునేది లేదని భూమనను హెచ్చరించారు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య విద్యా బోధన

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల లక్కనపల్లి పంచాయతీకి సంబంధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థినిలకు హెల్త్ ఎడ్యుకేషన్, సేఫ్టీ ఎడ్యుకేషన్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ లో భాగంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కాంతమ్మ బోధించడం జరిగినది. ఈ సందర్భంగా తీర్థం పిహెచ్సి సంబంధించిన ఆరోగ్య సిబ్బంది మరియు డాక్టర్ అరుణ కుమార్ ఆధ్వర్యంలో స్కూల్ నందు సీజన్ వ్యాధులు మరియు భ్రూణ హత్యల్ని నిర్మూలించడం, మానవజాతి మనుగడను కాపాడుకోవడం మరియు ఆడ శిశువును సంరక్షించుకోవడం వంటి విషయాలపై చర్చించి ప్రతిజ్ఞ చేయడం జరిగినది. చిన్న వయస్సులో పెళ్లి చేసుకున్న ఎడల తల్లి మరియు పుట్టబోయే బిడ్డకు వచ్చే నష్టాల గురించి చెప్పడం, అమ్మాయి వివాహ వయస్సు 21 సంవత్సరాలుగా అబ్బాయి వయస్సు 24 ఉండేలా వివాహం చేసుకోవాలని విద్యార్థినీయులను ఎడ్యుకేట్ చేయడం జరిగినది. టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, అతిసారా, మరియు వివిధ రకాలైన వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు హ్యాండ్ వాష్ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత తీసుకోవాలసిన జాగ్రత్తలు మరియు ప్రతిరోజు ఒక గంట వ్యాయామము మరియు యోగా చేయడం ఎంతైనా అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి హెచ్ఎం కవిత ఎం ఎల్ హెచ్ పి సావిత్రి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుత్తూరు సీఐగా శేఖర్ రెడ్డి

విశాలాంధ్ర - పుత్తూరు: అర్బన్ సీఐగా కె.ఆర్.శేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూల్ జోన్లో సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐ సరేంద్రనాయుడు ఇటీవలే వీఆర్ కు బదిలీ అయ్యారు.

మరణం తర్వాత కూడా జీవితం ఇవ్వొచ్చు

అవయవ దానంపై అవగాహన కల్పించిన అపోలో హెల్త్ క్లబ్

విశాలాంధ్ర - చిత్తూరు : అవయవ దానంపై అవగాహన కల్పించేం దుకు గురువారం అపోలో యూనివర్సిటీ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పీసీఆర్ జూనియర్ కాలేజీలలో జరిగిన ఈ కార్యక్రమంలో "అంగ్‌దాన్ జీవదాన్" అనే థీమ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు.ఈ సందర్భంగా అపోలో యూనివర్సిటీ ఫిజియోథెరపీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం.ఎల్. రమ్యకృష్ణ, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం అధ్యాపకుడు అశోక్ పి ఎం రెడ్డి మాట్లాడుతూ... అవయవ దానం అంటే కేవలం శరీర భాగాలను ఇవ్వడం మాత్రమే కాదని, అది ఒక కొత్త జీవితం అందించే దానం అని పేర్కొన్నారు. ఒక మనిషి మరణం తర్వాత కూడా, అతని అవయవాలు మరొకరికి జీవితం ఇవ్వగలవని, సమాజంలో దీనిపై చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అపోలో మల్టీ ఆర్గన్ రీ ప్లాంటేషన్‌లో దేశవ్యాప్తంగా ముందంజలో ఉందని. ఇది ఎంతో మందికి జీవితాన్ని అందిస్తోందని చెప్పారు.అవయవ దానం ఎలా చేయాలి? ఎవరెవరికి సాధ్యం? దానికి సంబంధించిన నిబంధనలు ఏమిటి?" అన్న అంశాలను శాస్త్రీయంగా విద్యార్థులకు వివరించారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. ఎస్. హసీనా నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, స్టూడెంట్ కోఆర్డినేటర్లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గురప్ప స్వామి ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవంలో శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర - పూతలపట్టు : పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, వైయస్.గేటు సమీపంలో గల మోటకంపల్లె గ్రామస్తులతో నూతనంగా నిర్మించిన గురప్ప స్వామి వారి దేవస్థానం మహ కుంభాభి, షేకం మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా "పూతలపట్టు శాసనసభ్యులు హాజరయ్యారు. మోటక పల్లె గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే మురళీమోహన్ గారికి గ్రామస్తులు ఘన ంగా స్వాగ తం పలికారు. అనంతరం ఆలయంలోని గురప్ప స్వామి వారిని దర్శించి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో ఆయన ప్లాన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థ ప్రసా దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల అధ్య క్షులుగం గారపుహరి బాబునాయుడు,మోటకంపల్లెగ్రామస్తులు పాల్గొన్నారు.

చెంగాలమ్మను దర్శించుకున్న సతీష్ రెడ్డి

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: గౌరవ సలహాదారు శ్రీ జి.సతీష్ రెడ్డి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అనం తరం వేద పండితులచే శ్రీ అమ్మవారికి పూజలు నిర్వహించచన తదుపరి వేదపండితులచే ఆశీర్వచనము, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమములో సూళ్ళూరుపేట, ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు కర్లపూడి సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా బస్సును ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: పట్టణంలోని వసతిగృ హాల్లో చదువుతున్న విద్యార్థులకు అనుకూలంగా బస్సు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆలయఅధికారులను కోరారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సదర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడ ుతూ సమీకృత ప్రభుత్వ బాలుర వసతి గృహ(ఎస్సీ) విద్యార్థులకు వసతులు ప్రభుత్వం కల్పించినప్పటికీ పాఠశాలలు దూరంగా ఉండటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే స్కిట్ నర్సింగ్ కళాశాల వ్యాను విద్యార్థులకు సమయానుకూలంగా ఉదయం వసతిగృహం నుంచి పాఠశాలలకు, సాయంత్రం పాఠశాలల నుంచి వసతి గృహంలో వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు శివ, కార్యద ర్శులు అభి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాబు బూటకపు మాటలకు మోసపోయాం: నూక తోట రాజేష్

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సార్వత్రిక ఎన్నికల్లో బాబు బూటకపు మాటలకు మోసపోయామంటూ సత్యవేడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నూక తోట రాజేష్ అన్నారు. మండలంలో గురువారం వైయస్సార్సిపి పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు పి.మణి నాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ చల్లమామపురం, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోట రాజేష్ మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటా పర్యటించి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే చంద్రబాబు చేసిన మోసాలు బయటపడతాయి అన్నారు. బాబు బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు అనేక హామీలు ప్రవేశపెట్టారు. అధికారంలోకి వచ్చాక మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ నెరవేర్చేం తవరకు ప్రజల్లో బాబు మోసాలు ఎండగడతామంటూ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు వేలూరు రాకేష్, గోపాల్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి,వైస్ ఎంపీపీ ముని కృష్ణారెడ్డి,రవి రెడ్డి, దేవదాసు రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లా.. సంక్షోభ హాస్టళ్లా..

గదుల్లో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి.. - మంచినీరు.. మరుగుదొడ్లు లేవు..

అపరిశుభ్రంగా వంట తయారీ గదులు - బీసీ హాస్టల్‌ను పరిశీలించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకుని బస చేయడం కోసం ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో కనీస వసతులు కనిపించడం లేదని.. మారుమూల గ్రామాల్లో వుండే పిల్లలు ఇంటి వద్దనే ఉండి చదువుకోలేక.. ఆర్థిక వనరులు లేకుండా ఇబ్బందులు పడి దూరంగా వున్న పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోతుండటంతో ప్రభుత్వం వసతి గృహాలను అందుబాటులోకి తెస్తే.. ఆ వసతి గృహాలను కూడా సరిగా నిర్వహించలేకుండా కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తాటితోపు వద్దనున్న ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌ను ఆయన బుధవారం రాత్రి పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసియున్న పడక గదులను పరిశీలించారు. అనంతరం చదువుకోడానికి అవసరమైన హాలు లేకపోవడం, భోజనం తినడానికి ఏర్పాటు చేసియున్న డైనింగ్ హాలుకు కిటికీలు లేకుండా ఫ్యాన్లు తిరగకుండా వుండటంతో ఉక్కపోతతో పిల్లలు ఉక్కిరిబిక్కిరవడాన్ని గమనించారు. ఆ తరువాత వంట తయారీ గదిని పరిశీలించగా అక్కడ అపరిశుభ్రతను గమనించి ఇలాగైతే పిల్లలు ఎలా తింటారని ప్రశ్నించారు. అయితే రాత్రి భోజనంకు తయారు చేసి పప్పు, అన్నం, కోడిగుడ్లును పరిశీలించిన ఆయన నాణ్యతగానే వున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తరువాత స్టోర్ రూమ్‌ను పరిశీలించి కోడిగుడ్డు, అరటిపండు, కాయగూరలు, బియ్యం, ఇతరత్రా వంట తయారీ సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందించే చిక్కీలను కూడా పరిశీలించారు. అనంతరం పిల్లలతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు సక్రమంగా లేవని, బట్టలు ఉతకడానికి సరిపడ స్థలం లేకపోవడం, చదువుకునేందుకు అవసరమైన హాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు పలువు రు విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వసతి గృహాల్లో సౌక ర్యాలు కల్పించండి...యువగళం పాదయాత్రలో విద్యార్థుల కష్టాలు తెలుసుకుని విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చానని డబ్బా కొట్టుకునే విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ వసతి గృహాల్లో సంక్షోభం గురించి ఏం సమాధానం చెబుతారని చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యా వ్యవస్థ బాగుచేయడం దేవుడెరుగు కనీసం వసతి గృహాల్లో సంక్షేమాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు పడుతున్న కష్టాలు కళ్లారా చూసి వసతులు కల్పించాలని, కనీస సౌకర్యాలు ఏర్పా టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజక వర్గంలో చంద్రగిరిలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలో వున్న మిగతా సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకో వచ్చ న్నారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ వసతి గృహాల సంక్షేమం పూర్తిగా విస్మరించారని, పేద విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారన్న విషయం గుర్తించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసే చంద్రబాబు సర్కారు చిన్నగొట్టిగల్లు, భాకరాపేట వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. అక్కడి పిల్లలు మల విసర్జనకు బహిర్భూమికి వెళ్లకుండా చూడాలని, మౌలిక వసతు లపై దృష్టి పెట్టకుండా ప్రచార ఆర్భాటాలకు కోట్లు ఖర్చు చేయడం మంచిదికాదని సూచించారు. అంతకు ముందు హాస్టల్ వార్డెన్ శ్రీదేవితో మాట్లాడిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ఎంత మేరకు బిల్లులు రాలేదన్న విషయాలను కూడా తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో హర్షిత్ రెడ్డితో పాటు వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం నేతలు బి.ఓబుల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, గూడూరు రఫి, భానుప్రకాష్‌రెడ్డి, యశ్వంత్, నక్కా హరి బాబు, శేష, వెంకటరమణనాయక్, పార్థ సారథిలు వున్నారు.

ఘనంగా భానోదయ కలంకారీ 15వ వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: పట్టణంలోని భానోదయ కలంకారీ సంస్థ 15వ వార్షికో త్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భ ంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరికైనా శ్రీకాళహస్తి అంటే గుర్తుకు వచ్చేది శ్రీకాళహస్తీ శ్వరస్వామి, కలంకారీ అన్నారు. ఈ కళ ఎంతో ప్రాచీనమైందని తెలిపారు. కాలం మారినా కలంకారీ కళకు ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. ఈ కళను ప్రోత్సహి స్తున్న భానోదయ కలంకారీ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి కొట్టే సాయి,భానోదయకలంకారినిర్వాహకురాలుపద్మావతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో ఘనంగా కాన్వొకేషన్, గ్రాడ్యుయేషన్ ప్రదానోత్సవం

- యంబియు రిజిస్ట్రార్ కె.సారధి

విశాలాంధ్ర- చంద్రగిరి: యంబియు రెండవ కాన్వొకేషన్ మరియు శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగు కాలేజి 14వ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగష్టు రెండవ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు యంబియు ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత రాజ్యసభ సభ్యులు ప్రఫుల్ పటేల్ హాజరవుతున్నారని విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ మోహన్ బాబు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథులుగా ప్రొ-ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వినయ్ మహేశ్వరి, వైస్-ఛాన్సలర్ ఆచార్య నాగరాజ రామా రావు, పాల్గొంటారన్నారు. ప్రత్యేక అతిథులుగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, జాతీయ విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షులు అయిన డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొంటున్నారు. యంబియు ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగు కాలేజ నుండి1698 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకోబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆనందన్ శివమణికి, విశిష్ట రాజకీయ నాయకుడు, ప్రముఖ పాత్రికేయుడు మరియు మహారాష్ట్రకు చెందిన లోక్ మత్ పత్రిక అధ్యక్షుడు అయిన విజయ్ జవహర్ దార్డా గారికి మోహన్ బాబు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర - పెనుమూరు: మండలంలోని తూరుపల్లి పంచాయతీ గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సూపారి పాలనలో ముందడుగు భాగంగా నేడు జీడి నెల్లూరు నియోజకవర్గ ప్రభుత్వ విప్ వియ్యం థామస్ పర్యటిస్తారని మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని తెలుగుదేశం నాయకులు అధికారులు అనధికారులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

మౌలిక వసతులపై గిరిజనులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పెనుమూరు: మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ కృష్ణ యానాది కాలనీ యందు గిరిజనులకు మౌలిక వసతుల అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం కృష్ణ యానాది కాల యందు మహిళలను సమావేశపరిచి ఆధార్ కార్డులు రేషన్ కార్డులు రోడ్లు స్ట్రీట్ లైట్లు పింఛన్లు మొదలైన సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఇరిగేషన్ ఏఈ భరత్. పంచాయతీ కార్యదర్శి ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు ఎంఈఓ భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హమీద్ భాషను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

విశాలాంధ్ర - కార్వేటి నగరం : మండల పరిధిలోని టీకేఎం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా దంకా హమీద్ భాషను సాల్వల కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి లో 37 సంవత్సరాలు అంకితభావంతో పనిచేశారని అదేవిధంగా ఆదర్శప్రాయుడని, విలువలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన తన నిజ జీవితంలో నైతిక విలువలను పాటిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీత దంకా హమీద్ భాష మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాల న్నారు. ఆగస్టుమూడవ తేదీన ఆదివారం కార్వేటి నగర్ హిందూ ముస్లిం కళ్యాణ మండపం నందు జరిగే సన్మాన సభకు అందరూ హాజరు కావాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి

విశాలాంధ్ర - చంద్రగిరి: పదవీ విరమణ తర్వాత మీ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్బీయు రీజియన్ నిర్మల్ కుమార్ ప్రియా అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్, చంద్రగిరి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. సుకుమార్ మరియు జనరల్ సెక్షన్ విభాగ అధిపతి డాక్టర్ టి. నరసింహారెడ్డి పదవీ విరమణ మహోత్సవం నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ చంద్రగిరి లో అంగరంగ వైభవంగా జరి గినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్వీయు రీజియన్ నిర్మల్ కుమార్ ప్రియా డాక్టర్ ఎం.ఎస్. సుకుమార్ ని ఉద్దేశించి 43 ఏళ్ల సుదీర్ఘ పదవీకాలం చేపట్టిన మీ ఘనత స్ఫూర్తిదాయకమని ఇది ఒక చారిత్రాత్మక సంఘటన అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్లు బి. నాగేశ్వరరావు, విజయభాస్కర్, బెహరా శ్రీనివాసులు మరియు సుమారు 30 మందికి పైగా వివిధ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ లు హాజరు అయ్యి వారివురు తన పదవీ కాలమందు వివిధ ప్రాంతాలలో ఎన్నో పదోన్నతులు చేపట్టి విద్యా ర్థుల భవిష్యత్తు నిర్మాణాన్ని తీర్చిదిద్దిన వారి నిరంతర శ్రమ అనన్యసా మాన్యమని, వారి నిస్వార్థ విద్యా సేవలో వారి కర్తవ్యంను సమర్థవంతంగా నిర్వహించు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న వారి ఔన్నత్యం మరువరానిదని కొనియాడారు. ఈ కార్యక్రమానికి వారితో కలిసి పని చేసిన సహోధ్యాపకులు, ఉన్నతాధికారులు, పూర్వ విద్యార్థులు మరియు బంధుమిత్రులు విచ్చేసి వారిని ప్రశంసించి ఘనంగా సన్మానించారు.

గ్రామకంతం భూముల విస్తరణపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదల ఇళ్లకు విలువ కల్పించేలా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుందని ఎంపీడీవో రామచంద్ర వెల్లడించారు. తన చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఈవోపీఆర్డీ దయాసాగర్‌తో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గ్రామ కంతం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి విలువ కల్పించే అధికారం సంబంధిత వీఆర్వోలకు వుందని, అయితే గ్రామకంతం భూములకు ఆనుకుని పట్టా భూముల్లో ఇంటి నిర్మాణాలు చేసుకున్న వారికి కూడా గ్రామకంతం కిందనే రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అందుకోసం విస్తరించిన గ్రామకంతం భూములను పరిశీలించి అందులో ఇంటి నిర్మాణాలు చేసుకున్న వారి వివరాలు సేకరించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓలు తప్పకుండా ఆయా గ్రామాల్లోని గ్రామ కంతం భూములను పరిశీలించి ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు చేసుకున్న భూమితో పాటు అదనంగా నిర్మించిన ఇంటి నిర్మాణాలను గుర్తించాలన్నారు. అందుకు తగినట్టుగా ఎఫ్ఎంబి తయారు చేసి గ్రామకంతం భూముల విస్తరణకు సంబంధిత తహశీల్దారుకు నివేదిక అందించేలా ఫైలును సిద్ధం చేయాలని సూచించారు. మండల పరిధిలో సి.గొల్లపల్లి, దుర్గసముద్రం, వేమూరు, రామానుజపల్లి, సి.మల్లవరం పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయడం జరిగిందన్నారు.

పుత్తూరు డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకం

విశాలాంధ్ర - పుత్తూరు :పుత్తూరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పుత్తూరు ఆర్టీసీ డిపో (ట్రాన్స్‌ఫోర్ట్) అసిస్టెంట్ మేనేజర్ మంగమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవర్లకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. ఎంపికైన వారు సంస్థ నియమ, నిబంధనలకు లోబడి విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, ట్రైనింగ్ క్లియరెన్స్ సర్టిఫికేట్తో పుత్తూరు డిపో కార్యాలయంలో నేరుగా హాజరుకావాలని సూచించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి కుంభాభిషేకంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ తలపా దామోదర్ రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మండలంలోని విశాలాక్షి నగర్‌లో నూతనంగా నిర్మించిన విజయగణపతి ఆలయంలో గురువారం ఆగమోక్తంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి దర్శించుకుని మొక్కులుచెల్లిం చుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, నవీన్, ఆంటోని, పురుషోత్తం, మౌలా, పుట్టారెడ్డి, విజయ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరు గారూ..! కరుణించండి

'చెత్త' సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నాం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కమిషనరు గారూ..! కరుణించండి. 'చెత్త' సమస్యతో చాలా ఇబ్బంది పడుతున్నామంటూ శ్రీరామనగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామనగర్ కాలనీలోని వినాయకవీధిలో చెత్త సమస్య చాలా అధికంగా ఉంది. ఇక్కడ మున్సిపల్ పార్కు సమీపంలో ఓ ఖాళీ ప్లాటు ఉంది. ఇక్కడ ముళ్ల చెట్లు ఎక్కువగా పెరిగి పోయాయి. ఇక్కడ నుంచి పాములు తరచూ జనావాసాల్లోకి వస్తున్నాయి. పాముల భయంతో ఇళ్ల తలుపులు, కిటికీలు తెరవడానికి కూడా ఈ వీధిలో నివాసం ఉండే జనం భయపడుతున్నారు. వినాయకవీధిలోనే మురుగు కాలువ పొడిగింపు పేరుతో సుమారు ఎనిమిది నెలల కిందట తవ్వేశారు. అయితే అప్పటి నుంచి ఈ కాలువకు మరమ్మతులు చేయలేదు. ఫలితంగా ఈ కాలువ దాటి ఇళ్లలోకి వెళ్లడానికి జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పురపాలక కమిషనరుకు పలు పర్యాయాలు వినాయకవీధి నివాసులు ఫిర్యాదు చేశారు. అయినా ఈ సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదు. మురుగు కాలువ తవ్వేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ ద్వారా కూడా పాములు ఇళ్లలోకి వస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో చెత్త కూడా సక్రమంగా తీయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పురపాలక అధికారులు ఇకనైనా స్పందించి ఈ సమస్యలు పరిష్కరించ వలసి ఉంది.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న బ్రహ్మగుడి ఆవరణలో ఈ నెల 8వ తేదీన ఉదయం 7గంటల నుంచి సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తైదువులు, భక్తులు ఈ వ్రతంలో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని ఆయన కోరుకున్నారు.

ప్రతి బ్యాంకులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సిఐ

విశాలాంధ్ర - తడ : తడ మండలంలోని ప్రతి బ్యాంక్ లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిఐ మురళీకృష్ణ ,ఎస్ఐ కొండప్ప నాయుడు బ్యాంకు అధికారులకు సూచించారు. గురువారం తడ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన బ్యాంక్ మేనేజర్ల సమావేశంలో సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తడ సూళ్లూరుపేట మండలాలలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బ్యాంక్ మేనేజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బ్యాంక్ లో దొంగతనాలు, దోపిడీలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేక సూచనలు చేశారు. అందులో భాగంగానే తడ మండల పోలీస్ స్టేషన్ లో సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో తడలో ఉన్న బ్యాంక్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన బ్యాంక్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి బ్యాంకు దగ్గర ప్రైవేట్ సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా బ్యాంకుల దగ్గర రాత్రి సమయంలో తాళం వేసిన తర్వాత అలారం సెట్ చేసుకోవాలని ఎవరైనా బ్యాంకు ఓపెన్ చేస్తే అలారం మోగేటట్లు చూసుకోవాలని వివరించారు. అదేవిధంగా ప్రతి బ్యాంక్ లో సీసీ కెమెరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయంలో అప్పుడప్పుడు బ్యాంకు అధికారులు సెక్యూరిటీ గార్డును తనిఖీలు చేస్తూ ఉండాలని సూచించారు. ప్రతిరోజు పోలీసులు సెక్యూరిటీ గార్డ్ ను తనిఖీలు చేసేటట్లు ప్రత్యేక పాయింట్ బుక్కు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం తడ పరిసర ప్రాంతాల్లోని బ్యాంకులను పరిశీలించి బ్యాంకుల వద్ద సీసీ కెమెరాల పనితీరుపై బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అడవిలోకి దారి సౌకర్యం లేకుండా కంకర తవ్వకాలు

గిరిజనుల ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్

విశాలాంధ్ర-సత్యవేడు: పివిపురం పంచాయతీ చమర్థకండ్రిగ గిరిజనులకు అడవిలోకి దారి సౌకర్యం లేకుండా కంకర తవ్వకాలు జరుపు తున్నట్టు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజవర్గ సిపిఐ కార్య దర్శి చిన్ని రాజ్ ఆరోపించారు.కంకర తవ్వకాలు వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద చమర్థకండ్రిగ గిరిజనులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని రాజ్ మాట్లాడుతూ చమర్థకండ్రిగ గిరిజన కాలనీ చుట్టూ సెవెన్ హిల్స్,లక్ష్మీనరసింహ,లక్ష్మీబాలాజీ కంకర క్వారీలు నడుస్తు న్నట్టు పేర్కొన్నారు.అయితే ఈ క్వారీ తవ్వకాల వల్ల గిరిజనులు అడవిలోకి వెళ్లడానికి దారి లేకుండా పోయిందన్నారు .గిరిజనులు అడవిలోకి వెళ్లి బూరగబంక,తేనె,నెల్లికాయి ఫలాలను తీసుకొచ్చి వాటి విక్రయం ద్వారా బతుకు జీవనం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. అడవి తల్లిపై ఆధారపడ్డ గిరిజనులకు దారి సౌకర్యం లేకుండా కంకర వారి యాజమాన్యాలు పూనుకోవడం దుర్మార్గ మన్నారు. పైగా ఇక్కడ నడుస్తున్న కంకర క్వారీలు సామర్థ్యానికి మించి పేలుళు జరపడం వల్ల గిరిజనులు నివసిస్తున్న ఇంటి గోడలు పగుళ్లు బారిందన్నారు.దీంతోపాటు గిరిజనులకు ఇచ్చిన ఇంటి స్థలాలను కూడా జెకె కంకర క్వారీ కబ్జా చేసినట్టు ఆయన ఆరోపించారు. సర్వే నెంబరు 10,23,27 లోని కాలువలు,చెక్ డ్యాము సైతం ఆక్రమిం చుకొని క్వారీ త్రవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగి స్తున్నట్టు ఆరోపించారు.పైగా సర్వేనెంబర్ 11లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం పేరుతో ఉన్న నాలుగు ఎకరాల భూమి కూడా క్వారీపరమై,రెండు మూడు చేతులు కూడా మారిందన్నారు.క్వారీ తవ్వకాలు వల్ల గిరిజనులకు తాగునీరు అందిస్తున్న చేత బావి ఎండిపోయింది అన్నారు.పైగా పంచాయతీ కుళాయిల ప్రధాన పైపు లైను దెబ్బతినడంతో తాగునీటి సరఫరా కావడం లేదు అన్నారు. అలాగే ఓబుల్ రాజ్ కండ్రిగలో అక్కడ దళితులకు గిరిజనులకు ఇచ్చిన భూములు సైతం పెత్తందారుల గుప్పెట్లో ఉన్నట్టు ఆరోపిం చారు. అందువల్ల చమర్తి కండిగలో అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర సర్వే చేసి గిరిజనులకు న్యాయం చేయాలని అధికారులు కోరారు.దాదాపు గంటపాటు ఆందోళన నిర్వహించిన అనంతరం స్థానిక తహసిల్దారు రాజశేఖర్కు గిరిజ నులు వినతి పత్రం సమర్పిం చారు. దీనిపై తహసిల్దార్ రాజశేఖర్ స్పందిస్తూ క్షేత్రస్థాయిలో స్థాయిలో పరిశీలించి గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను అని హామీ ఇచ్చారు.ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నాయకులు చంద్ర, మురళి రైతు సంఘం నాయకులు ధనుంజయులు స్థానిక గిరిజన సంఘం నాయకులు శ్రీను,సుధాకర్ ఓబుల రాజు కండ్రిగ దళిత సంఘంనాయకులుచిరంజీవి రవి పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా రాజగోపుర కుంభాభిషేక వేడుకలు

విశాలాంధ్ర-సత్యవేడు:సత్యవేడు పట్టణంలోని శ్రీకళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురానికి మహ కుంభాభిషేక వేడుకలు కన్నుల పండుగగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా రెండో రోజు గురువారం ఆలయంలో ప్రధాన అర్చకులు, ఆలయ ధర్మకర్త ఇందూరు రవికుమార్ ఆధ్వర్యంలో అర్చకులు మల్లికార్జున,సుబ్రహ్మణ్యం,యోగేశ్వరయ్య, బాలాజీ,చంద్రశేఖర్, రాంప్రసాద్, శ్రీనివాసులు,షణ్ముగం, రాజా,గుణశేఖర్, మునిరా మయ్య,అయ్యప్ప, ఈశ్వరయ్య,వెంకటేశులు తదితరుల బృందం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ నేపథ్యంలో ఉదయం 6 గంటలకు గణపతి,గురు, సూర్య పూజ,సుమంగళి పూజ,అష్టదిక్పాలక పూజ, విగ్రహాల అష్ట బంధనం,గోపుర కలసాల ప్రతిష్ట, రెండవ కాలయాగశాల పూజ,హోమం తదితర పూజ క్రతు వులను నిర్వహించిన తర్వాత మహాద్వీపారాధన చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు సుహాసిని పూజ,కన్యపూజ,మూడవ కాలయాగశాల పూజ, హోమం వంటి పూజ జరిపించారు.ఈ క్రమంలో గోపుర కలస ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. యథావిధిగా అర్చకులు కలశాలతో ఆలయ ప్రదక్షణ పూర్తయిన తర్వాత స్వామివారి మూలమండప గోపర శిఖలో కలస ప్రతిష్ట నిర్వహించారు.కాగా రాజగోపుర మహా కుంభాభిషేక వేడుకలను పురస్కరించుకొని సత్యవేడు పట్టణానికి చెందిన గ్రామ పెద్ద జక్కల సోమసుందరం శెట్టి అర్చకుల బృందానికి వస్త్ర దానం చేశారు.మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదలను పంపిణీ చేశారు.

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఉల్లాస్ అక్షరాంధ్ర"

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వయోజన నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా మార్చే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఉల్లాస్ అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ద్వారా చేపట్టిన సర్వేలో జిల్లాలో వయోజన నిరక్షరాస్యులను గుర్తించారని తెలిపారు. ఇందులో భాగంగా,మొదటి విడతగా జిల్లాలో 88,687 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు డిఆర్డిఏ, డ్వామా, మెప్మా సంస్థల సహకారంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని వివరించారు.వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్. మహమ్మద్ ఆజాద్ మాట్లాడుతూ డిఆర్డిఏకి 67,170 మంది, డ్వామాకు 7,280 మంది, మెప్మాకు 14,237 మంది టార్గెట్?గా కేటాయించబడినట్లు చెప్పారు. పదిమంది అభ్యాసకులకు ఒక వాలంటీర్‌ను కేటాయించి, వారిని సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు లేదా పాఠశాలల్లో అక్షరాస్యత తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.మొత్తం 100 గంటల బోధనలో 15 గంటలు ఆడియో పాటలు, 40 గంటలు ప్రత్యక్ష పాఠాలు, 45గంటలు ప్రాక్టీస్ సెషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యాసకులకు 2026 మార్చిలో తుది పరీక్ష నిర్వహిస్తారు.నోడల్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ అక్షరాంధ్ర విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫంక్షనల్, డిజిటల్ మరియు ఫైనాన్షియల్ లిటరసీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధంగా ఈ కార్యక్రమం రూపుదిదు ద్దుకున్నదన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.మండల అభివృద్ధి అధికారి రామచంద్ర మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఏపీఎంలు, ఏపీవోలు, సీఎంఎంలు కీలక పాత్ర పోషించాలని కోరారు. స్వయం సహాయక బృందాలు మరియు పనికి ఆహార పథకం లబ్ధిదారులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు.కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ సిబ్బంది, అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పీ4 అమలుకు సహకరించండి : ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పీ4 అమలుకు పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో గురువారం ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, ఏపీఐఐసీ అధికారులతో కలిసి పరిశ్రమల నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు 16వేల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయన్నారు. వీరిని ఆర్థికంగా ఆదుకుని బంగారు కుటుంబాలుగా మార్చడానికి సహృదయంతో పరిశ్రమల నిర్వాహకులు మార్గదర్శులుగా ముందుకు రావాలని ఆయన కోరుకున్నారు. ఈ పేద కుటుంబాలకు విద్య, వైద్యం, కనీస మౌళిక వసతులు కల్పించడం బాధ్యతగా తీసుకోవలసి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కుప్పం నియోజకవర్గంలో 250 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ప్రైవేటు కంపెనీ యాజమాన్యాలు సీఎస్ఆర్ నిధులను నియోజకవర్గ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. పీ4పథకంలో భాగస్వాములై పేద కుటుంబాలను దత్తత తీసుకుని... పేదల సమగ్ర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

"కూరపాటి సుధాకర్ చౌదరి నివాసంలో ఎమ్మెల్యేలు ఆత్మీయ పలకరింపు.."

విశాలాంధ్ర - పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం. నరస రావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మామ గారైన కూరపాటి సుధాకర్ రావు నివాసంలో ఎమ్మెల్యేలు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గురువారం ఉదయం తిరుపతిలోని కూరపాటి సుధాకర్ చౌదరి నివాసానికి "పూతలపట్టు శాసనసభ్యుడు డాక్టర్ శ్రీ కలికిరి మురళీ మోహన్ , "పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చౌదరి హాజరై వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేలు అల్పాహారం తీసుకున్నారు. అనంతరం నేతలు సుదీర్ఘంగా పరస్పర అభిప్రాయాలు పంచుకున్నారు. నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలు, తాత్కాలిక రాజకీయ పరిస్థితులు వంటి పలు అంశాలపై వారు చర్చించారు. ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటుగా తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీకి బి.యన్ కండ్రిగ విద్యార్థిని

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పోలూరు సంజన జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు. కే రమణయ్య గురువారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా బి.యన్ కండ్రిగ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు పదవ తరగతి చదువుతున్నటువంటి పి సంజన జులై 25 నుంచి 28 వరకు జరిగిన నేషనల్ అసోసియేషన్ కబడ్డీ టోర్నమెంట్ అండర్ 17 విభాగం నందు పంజాబ్ రాష్ట్రంలో చండీగర్ ప్రాంతంలో పాల్గొనడం జరిగింది. వ్యాయామ దర్శకులు ఇలక మస్తానయ్య ,ఎస్ హరిబాబు, మరియు మ్యాజిక్ బస్సు కోచ్ డి రాంబాబు, ఈ విద్యార్థిని అభినందించడం జరిగింది. ఈ విద్యార్థికి పోటీలలో పాల్గొనడానికి సహాయ సహకారాలు అందించిన మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు వ్యాయామ దర్శకులు ఉపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.

మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.2లక్షల ప్రీమియం మంజూరు

విశాలాంధ్ర - పూతలపట్టు: మృతి చెందిన యువకుడి కుటుంబానికి రావలసిన బీమా మొత్తాన్ని అతని తండ్రికి అందజేయడం జరిగింది.. పాకాల మండలం పెద్దబ్బాయినపల్లి గ్రామానికి చెందిన ఎం భాస్కర్ కుమారుడు ఎం కిషోర్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు ఇతను పూతలపట్టు మండలం పేట మెట్ట గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకు లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 20 రూపాయలు చెల్లించి ప్రీమియం తీసుకున్నాడు ఈ యువకుడు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు ఇతనికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రెండు లక్షల రూపాయలు ప్రీమియం మంజూరు అయింది ఇదుకు సంబంధించిన చెక్కును బ్యాంకు మేనేజర్ విజయసాగర్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోట చెరువులో మహిళా మృత దేహం కలకలం

- మతి స్థిమితం లేని యాచకురాలుగా పోలీసులు గుర్తింపు

విశాలాంధ్ర - కార్వేటినగరం: కోటచెరువులో మహిళా మృతదేహం తేలాడుతున్నట్లు గురువారం కలకలం రేపిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న సీ.ఐ హనుమంతప్ప సంఘటా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సీ.ఐ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయం, నగర వీధుల్లో మతిస్థిమితం లేకుండా తిరుగాడుతున్న మహిళా గుర్తించామన్నారు. ఆమె మల విసర్జన కోసం చెరువు వద్దకు చేరుకు కాలుజారి పడి మృతి చెంది ఉండవచ్చని అనుమానాన్ని వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఆమె కోసం ఎవరైనా వచ్చినట్లయితే వారికి అప్పగించడం జరుగుతుందని, లేని పక్షంలో మండల తహసీల్దార్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికుల చేత దహనక్రియలు చేస్తామన్నారు. మృత దేహం ఫోటోలను ఆమె బంధువులు ఎవరైనా గుర్తించడం కోసం సోషల్మీడియాల్లో పోస్టు చేయడం కూడా జరిగిందని పేర్కొన్నారు.

ఆడిట్ నిర్వహణతో పారదర్శకత

విశాలాంధ్ర- బుచ్చినాయుడు కండ్రిగ :- మండలం కేంద్రంలోని వెలుగు కార్యాలయం నందు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలపై గురువారం ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.పి.ఎం మునెయ్య సమాచారం అందిస్తూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ఎంపిక చేయబడిన ఆర్.వి.ఎస్%డ% కో,సంస్థ ద్వారా వచ్చిన ఆడిటర్లు కార్తికేయ, నారాయణ రెడ్డి,లు మండల మహిళా సమాఖ్య మరియు మండలం లోని అన్ని గ్రామ సమాఖ్య లు బహిరంగ ఆడిట్ నిర్వహించడం జరిగింది, ఇందులో భాగంగా మండల మహిళా సమాఖ్య లో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో కమ్యూనిటీ ఇన్వెస్ట్ మెంట్ ఫండ్ 1 కోటి 44 లక్షలు అప్పు నిల్వలు ఉండగా 1 కోటి 13 లక్షల డిమాండ్ కి 100 శాతం రికవరీ రావడం జరిగిందన్నారు. ఉన్నతి (ఎస్సీ/ ఎస్టీ సబ్ ప్లాన్) లో 2 కోట్ల 97 లక్షలు అప్పు నిల్వలు ఉండగా డిమాండ్ 84 లక్షల 52 వేలుకు గాను 78 లక్షల 78వేలు వసూళ్లు తో 93 శాతం రికవరీ రావడం జరిగింది.అలాగే స్త్రీ నిధి 22 కోట్ల 13 లక్షలు అప్పు నిల్వలు ఉండగా డిమాండ్ 5కోట్ల 47 లక్షల 69 వేలుకు గాను 5కోట్ల 46 లక్షల 64 వేలు రికవరీ తో 99.81శాతం చెల్లించడం జరిగింది. అదేవిధంగా మండలం లోని 41 గ్రామ సంఘాలు ఆడిట్ పూర్తి చేయడం జరిగింది. ఈ నివేదికలు వచ్చిన వెంటనే అన్ని గ్రామ సంఘాలు వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించి వసూళ్ళ చెల్లింపులు, ఆదాయ వ్యయాలు లాభనష్టాలు తో పాటు సంఘం వారీగా పొదుపు లు మరియు అప్పులు వివరాలు తెలియజేయడం జరుగుతుంది. దీని ద్వారా అన్ని స్థాయి లలో పారదర్శకత పొంది తద్వారా మహిళా సంఘాలు మరింత అభివృద్ధికి ఋణాలు మంజూరు చేయడం జరుగుతుంది అని ఏపియం మునెయ్య తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.జి, సి.సి గెరటరెడ్డి, సి సి,లు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ, అకౌంటెంట్ లు గిరిజ, శిరీష, ఎంఎస్ లీడర్లు శ్వేత, భారతి మరియు వి. ఓ.ఏ లు పాల్గొన్నారు.

నగరిలో రంగనీళ్ళు పైపులు లీక్ అవుతున్నా పట్టించుకోని అధికారులు

నగరిలో రంగనీళ్ళు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి : సిపిఐ

విశాలాంధ్ర - పుత్తూరు : నగరిలో రంగనీళ్ళు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న అధికారులు మాత్రం నామమాత్రంగా రంగు అద్దక పరిశ్రమలు పైన నీటి కాలుష్యం పైన అధికారులు ప్రకటన నకు పరిమితం చేస్తూ చర్యలు తీసుకోవడం లేదు. ఒకపక్క కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అందరూ రాజకీయ పార్టీలకతీతంగా రంగు అద్దక పరిశ్రమలు ద్వారా వెలువడే రసాయన నీటిని ఈ టీ పీ ప్లాంట్ కి అనుసంధానం చేసి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు , పోలిసన్ డిపార్ట్మెంట్ అధికారులు పరిష్కారం చేస్తామన్నా హామీ ఇస్తూ పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరించడాని పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.దీనిపైన ఆధారపడి జీవిస్తున్న వేలాదిమంది కార్మికులు కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని జననివాసానికి దూరంగా వారికి స్థలం కేటాయించి అన్ని పరిశ్రమలు అక్కడ మార్చడానికి చర్యలు చేపట్టాలని అధికార యంత్రం సిపిఐ పార్టీ కోరుతున్నది కొత్త పేటలోని భజన గుడి వీధిలో నడిరోడ్డు పైన రంగు నీళ్ళు లీకేజీ అవుతున్నా అధికారులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. కాబట్టి మున్సిపల్ అధికారులు సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రావాలని వెంటనే లీక్ అవుతున్నా రంగు నీళ్లను కట్టడం చేయాలని, సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తున్నది. లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ సిపిఐ పార్టీ నాయకులు భాష విజయ కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకులు పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

- గూడూరు డీఎస్పీ గీతాకుమారి

విశాలాంధ్ర - గూడూరు: బ్యాంకులు పటిష్టమైన భద్రత ప్రమాణాలు పాటించాలని గూడూరు డీఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పలు బ్యాంకులను పరిశీలించి పలు సూచనలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకుల్లో నిరంతరం సి.సి కెమెరాలు , అలారం సిస్టమ్ , సెక్యూరిటీ గార్డ్ లను ఏర్పాటు చేసుకో వాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బందికి పలు సూచనలు తెలియచేశారు. ఈమె వెంట పట్టణ సీఐ లు శేఖర్ బాబు , శ్రీనివాస్ , పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గూడూరు రెండో పట్టణ పరిధిలోని సెయింట్ మేరీస్ మహిళ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, శక్తి యాప్, 112 నెంబర్ యొక్క ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు.

పదవి విరమణ మహోత్సవం

విశాలాంధ్ర- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల పంచాయతీ సెక్రటరీ కే సదాశివయ్య గురువారం పదవి విరమణ చేయడం జరిగినది.ఈ పదవి విరమణ మహోత్సవానికి బంధుమిత్రులు విచ్చేసి ఆయన్ను ఆయన సతీమణిని ఆశీర్వదించి,ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ఎంపీపీ మొగసాల రెడ్డప్ప మండల జడ్పీటిసి కేశవులు తదితర నియోజకవర్గస్థాయి నాయకులు, పంచాయతీ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది,మండల ప్రజలు విచ్చేయడం జరిగినది.

సోమల మండలంలో పౌర హక్కుల దినోత్సవం

విశాలాంధ్ర - సోమల : సోమల మండలంలోని పేటూరు గ్రామపంచాయతీ రెడ్డివారి పల్లి యానాది కాలనీ నందు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దారు మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా యానాది కాలనీకి చెందిన 12 కుటుంబాలు వారి కుటుంబ సభ్యులు హాజరై వారి సమస్యలను తెలుపుకున్నారు. తమకు ఇంటి పట్టాలు కావాలని, గ్రామానికి తాగునీటి సౌకర్యాన్ని, ఆధార్ కార్డులు లేని వారికి ఆధార్ కార్డులను, రేషన్ కార్డులను అందజేయాలని కోరారు మండల అభివృద్ధి అధికారి నారాయణ మాట్లాడుతూ కాలనీవాసులు అందరూ ఒకేచోట ఉండాలని తద్వారా వారి కాలనీ అభివృద్ధి చేసేందుకు వీలవుతుందని తెలిపారు. పెద్ద ఉప్పరపల్లి పిహెచ్సి వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను జరుపుతున్నామని ప్రతి తల్లి విధిగా ముర్రుపాలను పిల్లలకు తాపించాలన్నారు ముర్రుపాలపై ఉన్న అపోహలను వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : సీఐ మురళీకృష్ణ

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: బ్యాంకులలో భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బ్యాంకర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిఐ మురళీకృష్ణ మాట్లాడుతూ అనంతపురం జిల్లా హిందూపురం, తూము గుంట ప్రాంతంలో రెండు రోజులు క్రితం చోటు చేసుకున్న దోపిడీ నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల్లో కూడా బ్యాంకుల్లో భద్రత పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు. తడ, సూళ్లూరుపేట మండలంలోని 16 బ్యాంకుల మేనేజర్లతో జరిపిన సమావేశంలో బ్యాంకులలో ఏర్పాటుచేసిన అలారములు సీసీ కెమెరాలు సెక్యూరిటీ గార్డుల విధి నిర్వహణలో పనితీరుని అడిగి తెలుసుకోవడంతో పాటు ఆయనే స్వయంగా బ్యాంకుల వద్ద పరిస్థితిని సమీక్షించారు. లోపాలను గుర్తించి సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి వాటిని సరి చేసుకోవాలని వారికి ఆదేశాలను జారీ చేశారు. ఈ సమావేశంలో తడ ఎస్సై కొండప్ప నాయుడు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బయప్పగారిపల్లి సింగిల్ విండో కార్యవర్గం

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ రెడ్డిని పలమనేర్ మండలం బయప్ప గారి పల్లి సింగిల్ విండో కార్యవర్గ సభ్యులు గురువారం సాయంత్రం సన్మానించారు. బయప్పగారి పల్లి సింగిల్ విండో చైర్మన్‌గా వెంకటముని రెడ్డి, డైరెక్టర్లుగా భాస్కర్, వెంకట్రామయ్యలు నియమితులయ్యారు. దీంతో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మండల నాయకులు నాగరాజు రెడ్డి, మల్లీశ్వర్ రెడ్డి, వెంకటరత్నం, జగదీష్ నాయుడు, సెల్వరాజ్,స్వతంత్ర బాబు, కవీంద్రనాయుడు, అమర్నాథరెడ్డి, నరేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలసిన రెడ్డి అభ్యుదయ సంక్షేమ సంఘం

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు నియోజకవర్గంలో రెడ్డి అభ్యుదయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సలహాదారు రెడ్డి వారి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు :.జయరాం రెడ్డి (పెద్దవెలుగుటూరు)ఉపాధ్యక్షులు :1)రవిచంద్ర రెడ్డి (కీలపట్ల) 2)చంద్రారెడ్డి (వి.కోట సి.ఎల్లగరం) జనరల్ సెక్రటరీ :వెంకటముని రెడ్డి (నక్కపల్లి) జాయింట్ సెక్రటరీ:1)వేమారెడ్డి (ముదరం పల్లి)2) గంగాధర్ రెడ్డి (తాతిరెడ్డిపల్లి) కోశాధికారి: పి. మల్లీశ్వర్ రెడ్డి (కాప్పల్లి)పి ఆర్ ఓ: ఎన్ శీను రెడ్డి (జరవారిపల్లి)వి.మంజునాథ్ రెడ్డి (కంచిరెడ్డి పల్లి) అడ్వైజర్:1) బి యం కిషోర్ గౌడు (బైరెడ్డిపల్లి)2) ఆర్. అమరనాథ రెడ్డి (గంగవరం)3) ఎన్. ప్రతాప్ రెడ్డి (ఏడూరు) 4) ఎ. యం .రంగనాథ్ (వి .కోట)5)%=%. సుబ్రహ్మణ్యం రెడ్డి (పెద్ద పంజని) గౌరవ అధ్యక్షులు : ఎస్. నాగరాజ రెడ్డి (ముసళ్ళమడుగు)2) రవి కుమార్ రెడ్డి (ఇల్లూరు)వీరితో పాటు 25మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి,ఇల్లూరు అమరనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం పడే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర - పలమనేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారీ స్థాయిలో భారం మోపడానికి స్మార్ట్ మీటర్లు పెడుతున్నదని దీని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పలమనేరు లోని నేలకుంటలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆదాని మీటర్లు పెట్టడానికి సెకీ ఒప్పందం చేసుకున్న సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి మంత్రులు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ మీటర్లు పెడితే పగలగొట్టండని ప్రసారం చేసిన వీళ్ళు నేడు అధికారంలోకి వచ్చిన వెంటనే అదే సెకీ ఒప్పందాన్ని కొనసాగిస్తూ వేగంగా స్మార్ట్ మీటర్లు పెట్టడం దారుణం అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే గతంలో జరిగిన విద్యుత్ పోరాటం లాగా మరో విద్యుత్ పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా పలమనేరు నాయకులు రాజా, జయంతి హైదర్ వలీ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాభారత ఉత్సవాలకు ధ్వజారోహణం

భక్తిశ్రద్ధలతో ద్రౌపతి మాతకు వడిభాల సమర్పణ

విశాలాంధ్ర -రామచంద్రాపురం: మండలం లోని ఎన్.ఆర్ కమ్మపల్లి మహాభారత ఉత్సవాలకు గురువారం వేకువజామున పుష్కరాంశంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ముందు రాత్రి ద్రౌపతి మాత శ్రీకృష్ణ పంచ పాండవుల ఉత్సవమూర్తులతోపాటు పోతురాజుల విగ్రహాన్ని మంగళ వాయిద్యాల మధ్య పంబల మేళాలతో ఆలయం నుంచి నిలువురాళ్ల కమ్మపల్లి గ్రామంలోకి తీసుకొని వెళ్లారు. సాంప్రదాయ బద్ధంగా గ్రామ పెద్ద లెక్కమార్కండయ నాయుడు, నాగమ్మల కుటుంబ సభ్యులు హేమంత్ నాయుడు దంపతులచే అమ్మవారికి వడిబాల కట్టారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు ముందు ఈ తంతు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. అక్కడ నుంచి ఆలయ ధర్మకర్త నడవలూరు సంపత్ పిళ్ళట్క, మణెమ్మ కుమారులు రమేష్ బాబు అరుణాదేవి, రజనీకాంత్ లతా,కిరణ్ కుమార్ శుభ దంపతులు 59 వ మహాభారత ఉత్సవ ఉత్సవాల ధ్వజారోహణ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ప్రధాన అర్చకులు హరి ఆచార్యులు, అరవింద ఆచార్యులు,రామ్మూర్తి ఆచార్యుల బృందం వేదమంత్రాలతో గోవింద నామ స్మరణల మధ్య వేకువజామున ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్రౌపతి మాతకు పట్టు పీతాంబరాలను ధరింపజేసి వివిధ రకాల పరిమళ పుష్పాలు విలువైన ఆభరణాలతో అలంకరించారు. మధ్యాహ్నం జోష్ణ భాగవతారిణిచే వ్యాస జననం హరికథ గానం చేశారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర కళానాట్యమండలి వారు శ్రీకృష్ణ జననం, కంసక వధ పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామానికి చెందిన నాదెళ్ల మోహన్ నాయుడు, గుంటూరు శ్రీనివాసుల కుటుంబ సభ్యులు మూడు పూటలా భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయమంతా రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల విద్యుత్ కట్ అవుట్లతో తేదీవ్యమానంగా అలంకరించారు. గ్రామ పెద్దలు,దివంగత ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ వెంకటరత్నం ఆచార్యుల వారి శిష్య బృందం, ఘనాచార్యులు బటాచార్యులు అందరూ ఈ కార్యక్రమంలో కంకణదారులై పాల్గొన్నారు. 11 రోజులపాటు ఈ మహాభారత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు వివరించారు.

ఈనెల 5న రేణిగుంట గంగ జాతరకు చాటింపు

11 నుంచి 13వ తేదీ వరకు గంగజాతర మహోత్సవాలు

విశాలాంధ్ర-రేణిగుంట:తిరుపతి జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే రేణిగుంట గంగ జాతర మహెూత్సవాలు ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులు పాటు అంగరంగ వైభవంగా జరగనుంది.గంగ జాతర మహెూత్సవాలకు 5 వ తేదీ మంగళవారం రాత్రి చాటింపు వేయనున్నారు. గురువారం గంగమ్మ గుడి ఆల యంలో జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులు గంగ జాతర మహెూత్సవాలకు తేదీలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సోలా మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట గంగ జాతర మహెూత్సవాలు ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేణిగుంట ప్రజలందరి సహకారంతో గంగ జాతర మహెూత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు సదాశివరెడ్డి, జ్యోతి నారాయణ, లక్ష్మణ్ రెడ్డి, ఉమేష్, రావణ, రేణు, చిన్న బాబు, సురేష్, భాస్కర్, సూరి పాల్గొన్నారు.

సంపులో పడి కార్మికుడు మృతి

విశాలాంధ్ర -నాయుడుపేట: మేనకూరు పారిశ్రమక వాడలో ఉన్న బ్రేక్స్ ఇండియా కంపెనీలో ఘోరం. ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్న గుంటూరుకు చెందిన శ్రీరామ్ అనే యువకుడు మృతి. తోటి ఉద్యోగస్తులు గమనించి నాయుడుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపుపడిపోయిన గంట వరకు సంపులోనే మృతి దేహం వుండేది. నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో మృతదేహం ఉన్నా కూడా స్పందించిన యాజమాన్యం.. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యానికి అర్థం పడుతుంది.ఏం చేయాలో అర్థంకాక హాస్పిటల్ వద్దనే తోటి ఉద్యోగస్తులు పడిగాల్పులు.

ఎమ్మెల్యేను కలసిన గంగవరం తహసీల్దార్

విశాలాంధ్ర - గంగవరం : పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని గంగవరం తహసీల్దార్ పి. రేఖా గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్ఆర్ పురం మండలం నుంచి గంగవరం మండలానికి విచ్చేసిన ఆమె విధుల్లో చేరిన అనంతరం మొదటిసారిగా స్థానిక ఎమ్మెల్యేను కలవడం జరిగింది. మండలంలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, గిరిధర్ గోపాల్ తదితరులున్నారు.

పౌర హక్కుల పై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-కోట: భారత రాజ్యాంగం మనకు ప్రసాదించిన పౌర హక్కుల పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ జయ జయ రావు పేర్కొన్నారు మండల పరిధిలోని లింగాల స్వామిగుడి గిరిజన కాలనీలో గురువారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది.ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తమకున్న హక్కులు తెలుసుకొనుట ద్వారా మీకు ప్రభుత్వం కలిపించిన సౌకర్యాలు సాధించుకోవచ్చు అన్నారు.అలాగే ప్రభుత్వం అందజేసే సబ్సిడీ పథకాలను తెలుసుకొని ప్రభుత్వ కార్యాలయాల ద్వారా పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఓ.లు సచివాలాయల సిబ్బంది,పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

4నుంచి నీలకంఠేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీ సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని కార్యనిర్వహణాధికారి టి.బాపి రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలు 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. 4న ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రి చప్పరం ఉత్సవం... 5న రెండవ తిరునాళ్ళు, రాత్రి సూర్యప్రభ ఉత్సవం.. 6న మూడవ తిరునాళ్ళు, రాత్రి చంద్రప్రభ ఉత్సవం... 7న నాల్గవ తిరురాళ్ళు, రాత్రి చిలుక వాహనం, 8న ఉదయం కేతిగ ఉత్సవం, రాత్రి నంది సేవ... 9న ఉదయం చప్పరం ఉత్సవం, రాత్రి రథోత్సవం... 10న ఉదయం కేడిగం ఉత్సవం, రాత్రి కల్యాణోత్సవం, గజవాహన ఉత్సవం... 11న పార్వేటి ఉత్సవం, గుంట క్రింది పల్లి, జింగిలిపాలెం గ్రామాలకు చప్పర ఉత్సవం... 12న తీర్థ వారి ధ్వజావరోహణం, రాత్రి చప్పరం ఉత్సవం... 13న పల్లకి సేవ, ఏకాంత సేవ జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని బాపిరెడ్డి కోరుకున్నారు.

చంద్రగిరిలో 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' ప్రారంభం..!

- అబద్ధాలతో అధికారం చేపట్టి.. అందరినీ మోసం చేశారు
- మీ ఇళ్లకు వచ్చే కూటమి నేతలను చొక్కా పట్టుకుని అడగాలి
- అక్రమ అరెస్టులతో భాస్కర్‌ను ఎవ్వరు భయపెట్టలేరు
- ప్రారంభోత్సవ సభలో జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : 'జగనన్న పాలనలో ప్రజలకు సంక్షేమం అందింది.. బాబు ప్రభుత్వంలో సంక్షోభం తప్ప సంక్షేమం కంటికి కనిపించడం లేదు.. ఎన్నికలపుడు మాయమాటలు చెప్పడం.. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలను మోసం చేయడం చంద్ర బాబు నైజం.. అబద్దాలతో అధికారం చేపట్టిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఏడాది గడిచినా ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.. అందరినీ మోసం చేశారు.. అన్ని వర్గాల ప్రజలు జగనన్నే మేలు అనుకునేలా చేస్తున్నారు.. సూపర్ సిక్స్ పథకాలను అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ఏడాది గడిచినా ఆ ఊసే ఎత్తుకోవడం లేదు.. ఉచిత గ్యాస్ ఇస్తామన్నారు.. తుస్సు మనిపించారు.. ఇదిగో అమ్మకు వందనం అన్నారు.. ఎవ్వరికీ అందకుండా చేశారు.. ఆడబిడ్డ నిధి అన్నారు.. ఆ పథకాన్ని ఆమడదూరం చేసేశారు.. నిరుద్యోగులకు శఠగోపం పెట్టారు.. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు 143 హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారు.' అంటూ వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గురువారం 'బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని భూమన చేతులు మీదుగా ప్రారంభించారు. వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు మండలాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు చేసిన మోసాలతో పాటు చెవిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను, కక్ష సాధింపు చర్యలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పడం, అధికారంలోకి వచ్చాక దానిని మాయచేసి మోసం చేయడానికి ప్రతిపక్షంపై నిందలు వేయడం బాబుకు వెన్నతోపెట్టిన విద్య అని విమర్శించారు. బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ అన్న కార్యక్రమంలో చంద్రబాబు మోసాన్ని ప్రజలకు బట్ట బయలు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని, అప్పుడే చంద్రబాబు మళ్లీ మోసం చేశారన్న నిజం ప్రజలకు తెలుస్తుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా ఎన్ని మోసాలు చేశారో అన్నీ ప్రజలకు చెప్పే సమయం వచ్చిందన్నారు. జగనన్న ఆదేశాలు మేరకు పార్టీలో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త తమ తమ గ్రామాల్లోకి వెళ్లి బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఈ ప్రభుత్వం చేసిన మోసం, చెప్పిన అబద్ధాలను వివరించాలన్నారు.

టూరిజం కారిడార్‌గా చిత్తూరు

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు ఎన్టీఆర్ జలాశయం వద్ద త్రివేణి సంగమం, పుష్కర ఘాట్, అష్ట దేవాలయాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపడతామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.గురువారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు అధ్యక్షుడు తాండవ మూర్తి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ను కలిసి చిత్తూరు నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రణాళిక అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలవకుంట ఎన్టీఆర్ జలాశయం వద్ద ఘాట్ నిర్మించి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవ మూర్తి, సభ్యులు చంద్రబాబు, వరదరాజులు, శివకుమార్, అశోక్, రషీద్, నాగేంద్ర, జనార్ధన్, వెంకటేష్ పాల్గొన్నారు. చిత్తూరును టూరిజం కారిడార్ గా అభివృద్ధి చేయడానికి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రణాళికను టూరిజం మేనేజర్ కు స్మార్ట్ సిటీ సభ్యులు అందజేశారు.

నేడు షార్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఈ.ఎస్. పద్మకుమార్

విశాలాంధ్ర- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), శ్రీహరికోటకు కొత్త డైరెక్టర్గా. ఈ.ఎస్. పద్మకుమార్ నియమితులయ్యారు. ఆయన ఆగస్టు 1వ తేదీ నుంచి పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం షార్ డైరెక్టర్గా ఉన్న ఆర్ముగం రాజరాజన్ ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ), తిరువ నంతపురానికి డైరెక్టర్గా బదిలీ చేశారు. డా. పద్మకుమార్ బెంగళూరులోని ఇస్రో ఉపగ్రహ కేంద్రంలో కీలక పదవుల్లో పనిచేశారు. అంతరిక్ష పరిశోధనలో ఆయనకు విశేష అనుభవం ఉంది. షార్ వంటి ప్రాజెక్టులకు ఆయన నాయకత్వం కొత్త దిశలు చూపించనుందని ఇస్రో వర్గాలు భావిస్తున్నాయి.

పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సు నడపాలి

- బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

విశాలాంధ్ర - కార్వేటినగరం: విద్యార్థులకు అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని డిఎం పురం ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆరోపించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ బస్సు సౌకర్యాలు లేకుండా ఆలస్యంగా పిల్లలు ఇంటికి చేరుకుంటున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎప్పుడు తమ పిల్లలు ఎప్పుడు ఇంటికి చేరుకుంటారనే భయాందోళన రోజు రోజుకి పెరిగి పోతున్నాయని అన్నారు. విద్యార్థులకే సమయానికి బస్సు సౌకర్యాలు కల్పించ లేని కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు కూడా ఇలాగే ఉంటుందని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు సక్రంగా నడిచేలా చూడాలని అన్నారు. 5 గంటలు అయినా బస్సు రాకపోవడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్రవాహనాల్లో తీసుకెళ్లారని, అలాంటి సౌకర్యంలేని విద్యార్థులు పొద్దు పోయేంతవరకు బిక్కు బిక్కుమంటూ పాఠశాల ఆవరణంలో ఉండిపోవడంతో పాఠశాల వాచ్మెన్ వారికి తోడుగా నిలిచారు.

పులివర్తి నానిని పరామర్శించిన మోహన్ బాబు

విశాలాంధ్ర - పాకాల : చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని ని సినీ నటుడు మోహన్ బాబు గురువారం పరామర్శించారు. యువతి నాని మాతృమూర్తి పులివర్తి లక్ష్మీ భారతి ఇటీవల మృతి చెందారు. దీంతో మోహన్ బాబు పాకాల మండలంలోని ఆదేనపల్లి గ్రామపంచాయతీ పులి వర్తి వారి పల్లెలోని నాని స్వగృహం నకు విచ్చేసి పులివర్తి నాని తల్లి పులివర్తి లక్ష్మీ భారతి కి సంతాపం తెలిపారు. పులివర్తి నానిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తిరుపతి, చిత్తూరు జిల్లాలో దిగువ పేర్కొన్న మండలాలలో పనిచేయుటకు విలేకరులు కావలెను.
ఇంటర్‌మీడియట్ చదివి, తెలుగు భాషా పరిజ్ఞానం కలిగిన వ్యక్తులు అర్హులు.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి, వడమాలపేట, నగరి, నారాయణవనం, నాగలాపురం, వరదయ్యపాలెం, వాకాడు, చిట్టమూరు, పెళ్ళకూరు, డక్కిలి, వెంకటగిరి రూరల్, ఎర్రవారిపాళెం, ఐరాల, తవణంపల్లి, యాదమరి, శాంతిపురం, గుడిపల్లి.
వివరాలకు: 9490952134